గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం


చింతల్‌లోని ఓ పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు


డిటెక్టర్లతో అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


ఏపీహెచ్‌బీ కాలనీలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల వద్ద అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

రంగారెడ్డినగర్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ప్రశాంతంగా ముగిశాయి.. జంట సర్కిళ్లతో పాటు బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి, బీవీఆర్ఐటీ, దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ, మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, దూలపల్లి పరిధిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా ఉదయం 9 గంటలకే అభ్యర్థులు కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు 144 సెక్షన్‌ను విధించడం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షకు హాజరైన ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే పరీక్షా కేంద్రంలోని అనుమతించారు.

● కిడ్స్ సమ్మర్ క్యాంప్.. 4కే రన్





హైదరాబాద్ రన్నర్స్ అవుట్‌డోర్ కిడ్స్ సమ్మర్ క్యాంప్ గ్రాడ్యుయేషన్ సెర్మనీని హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ వద్ద ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ గంగారెడ్డి, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ప్రెసిడెంట్ అభిజిత్ మధ్కుకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై 4కే రన్‌ను ప్రారంభించారు. ఈ రన్‌లో నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 1100 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పిల్లలు ఆరోగ్యకరంగా పెరిగేందుకు దోహదపడే వాతావరణాన్ని పెంపొందించడానికి ఈ రన్‌ను నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

- కుత్బుల్లాపూర్

ఫేజ్–2లోపర్యటించి... సమస్యలను పరిష్కరించి


ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2లో సమస్యలు తెలుసుకుంటున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: స్థానిక సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఇందిరమ్మకాలనీ ఫేజ్–2లో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించారు. రోడ్లు, డ్రైనేజీ లైన్‌లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బాలాజీనగర్ అధ్యక్షుడు చిరంజీవి, ఇందిరమ్మకాలనీ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, సంగీత, మాహేశ్వరరావు, నరసింహయాదవ్, యాదయ్య, శ్రీనివాస్, కృష్ణ, రాజురెడ్డి, గిరి, బాలరాజు తదితరులు ఉన్నారు.

రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం


కొలన్ హన్మంతరెడ్డిని కలిసిన శివనగర్ కాలనీ గణేష్ సంక్షేమ సంఘం సభ్యులు

నిజాంపేట్: రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ఆదివారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిజాంపేట్ కార్పొరేషన్ 126 డివిజన్ శివనగర్ కాలనీ గణేష్ సంక్షేమ సంఘం సభ్యులు హన్మంతరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు కమిటీ హాలు, విద్యుత్ స్తంభాలను త్వరితగతిన ఏర్పాటు చేసేలా చూడాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ సాంబశివరావు, ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, జనరల్ సెక్రటరీ రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ జావీద్, కోశాధికారి నాగరాజు, ఆర్గనైసింగ్ సెక్రటరీ మాధవ్‌రావు, నాయకులు రత్నేశ్వర్‌రావు, జామున్ బాషా, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

అసంపూర్తి పనులు


భవన నిర్మాణ వ్యర్థాలతో పూడుకుపోయిన బాక్స్ డ్రెయిన్


గిరినగర్‌లో డ్రెయిన్‌ను ఆక్రమించి చేపడుతున్న నిర్మాణం

- గతేడాది జులైలో రూ.90 లక్షలతో పనులకు శంకుస్థాపన
- అర్ధంతరంగా నిలిచిన బాక్స్ డ్రెయిన్ పనులు
- కబ్జాకు గురవుతున్న డ్రెయిన్ స్థలాలు
- వెంటనే పనులు పునఃప్రారంభించాలని స్థానికుల డిమాండ్

రంగారెడ్డినగర్: వర్షాకాలంలో వరదనీరు నిలవకుండా చేపట్టిన బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పనులు అర్ధంతరంగా నిలిపోయాయి. ఇంతలో సందిట్లో సడేమియా అన్న చందంగా ఓ భవన నిర్మాణదారుడు డ్రెయిన్ స్థలాన్ని ఆక్రమించి పనులు చేపట్టడంతో కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్‌లో ఇంటి నెంబరు 21–93 నుంచి టెక్రో టూలింగ్ సిస్టమ్, ప్రభుత్వం మండల పరిషత్ పాఠశాల వెనుక గల్లీల గుండా బాక్స్ డ్రెయిన్ నిర్మాణ పనులకు జులై 2023లో రూ.90 లక్షల అంచనా వ్యయతో సర్కిల్ అధికారులు శ్రీకారం చుట్టారు.

◆ సదరు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కొన్ని రోజుల పాటు నత్తనడకన కొనసాగించాడు. పలుమార్లు ఈ విషయమై 'సాక్షి'లో వార్త కథనాలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు పనులు మొదలుపెట్టారు. అయితే స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమ యజమాని తన స్థలం గుండా డ్రెయిన్ నిర్మాణం కొనసాగిస్తున్నారని అడ్డు చెప్పడంతో మరోసారి పనులు నిలిచిపోయాయి. దీంతో కొంత మేర పనులు చేపట్టి శ్లాబ్ వేసి అసంపూర్తిగా వదిలేశారు. ఇంతలో ఒకసారి అసెంబ్లీ ఎన్నికలు, మరోసారి లోక్‌సభ ఎన్నికలు రావడంతో డ్రెయిన్ నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి..

డ్రెయిన్‌ను ఆక్రమించి నిర్మాణం..

గిరినగర్‌లోని ప్రభుత్వం ఎంపీపీ పాఠశాల ఎదురుగా నిర్మిస్తున్న వాటర్ డ్రెయిన్‌ను ఆనుకుని ఓ వ్యక్తి ఇటీవల 60 గజాల స్థలంలో భవన నిర్మాణం పనులు చేపట్టాడు. సదరు వ్యక్తి డ్రెయిన్ స్థలంలోకి జరగడంతో పాటు డ్రెయిన్‌పై శ్లాబ్ వేయని ప్రాంతంలో భవన నిర్మాణ వ్యర్థాలను వేయడంతో అది పూడుకుపోయింది. దీంతో ఇప్పటి వరకు చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులకు వెచ్చించి వృథా అయ్యే ఆస్కారముందన్నారు. ఈ విషయంలో సర్కిల్ అధికారులు స్పందించకుంటే వాటర్ డ్రెయిన్ పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలి


దుర్గంధంగా హెచ్ఏఎల్‌కాలనీ రోడ్ నం.4

సుభాష్‌నగర్: డ్రైనేజీ లైన్లు వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగు రోడ్లపై పారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాజులరామారం డివిజన్ హెచ్ఏఎల్ కాలనీలోని రోడ్డు నం.4లో గత రెండు నెలలుగా డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు పారుతోంది. ఈ విషయమై పలు మార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంతో తమకు ప్రతినిత్యం మురుగు కంపు తప్పడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మొత్తం దుర్గంధ భరితంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందికరంగా మారుతోందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే అవకాముందని వాపోతున్నారు. ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చింతల్: సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సీబీడీ బోయిన్‌పల్లి పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

◆ ప్రశాంత్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధి ఆంధ్రజ్యోతి ఫీడర్ పరిధిలోని రాజీవ్ గాంధీనగర్, న్యూ రాజీవ్‌గాంధీ వెంచర్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 8గంటల వరకు...

◆ ప్రాగాటూల్స్ సబ్‌స్టేషన్ ఈశ్వర్ విమల్ ఫీడర్ పరిధిలోని గాంధీనగర్, శివాజీ స్టాచ్యూ, ఆల్ఫా కాంప్లెక్స్, ఈశ్వర్ విమల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మాస్టర్ సునీల్‌కుమార్‌కు సత్కారం



కుత్బుల్లాపూర్: బెంగళూరుకు చెందిన షికాయ్ గుజూరియో కరాటే డోర్ స్పోర్ట్స్ ఫౌండేషన్ మాస్టర్ సునీల్ కుమార్‌ను ఆదివారం కుత్బుల్లాపూర్‌కు చెందిన బూమ్స్ అకాడమీ మాస్టర్ కృష్ణ సత్కరించారు. ఈ సందర్భంగా మాస్టర్ కృష్ణ మాట్లాడుతూ.. ఈ డిప్లమా పొందిన విద్యార్థులకు పోలీస్, ఆర్మీ విభాగాలలో జరిగే ఎంపిక ప్రక్రియలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం


సమస్యలపై ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న భగత్‌సింగ్‌నగర్ నాయకులు

చింతల్: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో నెలకొన్న సమస్యలపై ఆదివారం డివిజన్ నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. భగత్‌సింగ్‌నగర్ కాలనీలోని పలు గల్లీల్లోని అంతర్గత రోడ్లను పూర్తి చేయాలని, కమ్యూనిటీ హాలు వెనుక ప్రాంతంలో ఉన్న కాలువలో పూడిక తీత చేపట్టాలని, అదే విధంగా మట్టి కుప్పలను తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగుతున్నామని అన్నారు. స్థానిక సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు బిసు వెంకటేశంగౌడ్, కుడికెల సహదేవ్, చిప్ప రమేష్, కుడికల నాగరాజ్, సతీష్ వెంకటస్వామి, సదల రమేష్, కిషన్‌గౌడ్ అనిల్, శేఖర్‌గౌడ్, జగదీష్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్ ఉన్నారు.

బీసీ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెరగాలి

కుత్బుల్లాపూర్: దేశ రాజకీయాల్లో బీసీ ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెరగాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. ఆదివారం దేశ ప్రధానిగా నరేంద్రమోదీ మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తున్న నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. దేశ జనాభాలో 70 కోట్ల మేర బీసీ జనాభా ఉందన్నారు. జనాభాకు తగ్గట్టుగా కేంద్ర మంత్రి వర్గంలో 50 శాతం బీసీలకు స్థానం కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ముగ్గురు ఎంపీలకు కేబినెట్ పదవులు ఇవ్వాలన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా బలపడేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. రాష్ట్ర బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ బీసీ ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి రంగు క్రాంతి, జంగిల్ అఖిల్ జంగిటి నిఖిల్, శ్రీకాంత్ ముదిరాజ్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తురక చెరువు అభివృద్ధిపై సమావేశం


సమావేశంలో స్థానికులతో మాట్లాడుతున్న బండారి నరసింహారెడ్డి

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని తురక చెరువు అభివృద్ధి విషయమై ఆదివారం స్థానిక నాయకుడు బండారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తురక చెరువు అభివృద్ధికి సోమవారం ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే అధ్యక్షతన మున్సిపల్ అధికారులతో సమావేశం ఉందన్నారు. స్థానికులు హాజరై తమ గళం వినిపించాలన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీవెన్ ఎన్‌క్లేవ్, మిథిలానగర్, ప్రగతినగర్ ప్రశాంతిహిల్స్, భగత్‌సింగ్‌నగర్, ఏపీహెచ్‌బీ కాలనీ, తెలుగుతల్లినగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. అదే విధంగా శుభకార్యాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందించారు.

బాధితుడికి నష్టపరిహారం అందేలా కృషి చేస్తాం

సెల్లార్ గోడ కూలిన ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే


జీడిమెట్ల శ్రీనిలయా ఎన్‌క్లేవ్‌ను సందర్శించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: అపార్ట్‌మెంట్ సెల్లార్ గోడ కూలిన ఘటనలో గాయపడిన బాధితుడికి ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఇటీవల అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో మురుగునీటి కాలువ పనులు చేపడుతుండగా రిటర్నింగ్ వాల్ కూలి భగవత్ అనే కూలి అందులో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. ఆదివారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శ్రీనిలయా ఎన్‌క్లేవ్‌ను సందర్శించిన ఎమ్మెల్యే ప్రమాద ఘటనపై ఆరా తీశారు. ఈ ఘటనలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు భగవత్ యోగాక్షేమాలపై ఆరా తీసిన ఎమ్మెల్యే అతన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు కుంటా సిద్ధిరాములు, గోలి రమేష్‌గుప్తా, కాలే నాగేష్, గుమ్మడి మధుసూదన్‌రాజు, జ్ఞానేశ్వర్, సమ్మయ్య నేత, కాలే నాగేష్ తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

బీజేపీ ఎంపీలకు శుభాకాంక్షలు


బండి సంజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రాష్ట్ర బీసీ ఐక్య వేదిక అధ్యక్షుడు మహేందర్

కుత్బుల్లాపూర్: బీజేపీ ఎంపీలుగా గెలుపొందిన ఈటల రాజేందర్, బండి సంజయ్, అరవింద్‌ను ఆదివారం తెలంగాణ బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ ఆధ్వర్యంలో ఈ సంఘం నేతలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రంగు క్రాంతి తదితరులు ఉన్నారు.

గల్లీలు జల్లెడ పట్టి.. వీధి కుక్కలను తరలించి


దీపోచంపల్లిలో వీధి కుక్కలను తరలిస్తున్న బ్లూక్రాస్, మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: వీధి కుక్కల దాడి ఘటనలు వెలుగు చూసిన నేపథ్యంలో ఆదివారం దుండిగల్ మున్సిపల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దీపోచంపల్లి వార్డు నం.10లోని శ్రీకృష్ణనగర్‌కాలనీలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు ఆధ్వర్యంలో బ్లూక్రాస్ సొసైటీ, వెటర్నరి సిబ్బంది పలు గల్లీల్లో కుక్కల కోసం జల్లెడ పట్టారు. వాటిని పట్టుకుని యానిమల్ కంట్రోల్ బర్త్ వ్యాన్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించేందుకు తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ... కుక్కల బెడద తీవ్రంగా ఉంటే 994879555, 9542715377 నెంబర్లలో సంప్రదించాలన్నారు. బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కుక్కను తరలించి కరవకుండా ట్రీట్‌మెట్ చేస్తారని పేర్కొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న వారాల మహేష్

సుభాష్‌నగర్: నరేంద్రమోదీ మూడోసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఆదివారం బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. సూరారం విశ్వకర్మకాలనీలో బీజేపీ నాయకుడు వారాల మహేష్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.వాసు, దుర్యోధనరావు, వినోద్‌సింగ్, దూబే, అశిష్ ఉపాధ్యాయ, నీరజ్‌సింగ్, జేపీ శర్మ, ఎంపీ సింగ్, సంజయ్‌పాల్, సుభోద్‌కుమార్, త్రిభువన్‌కుమార్‌రాయ్, సరోజ్ తివారీ, దశరథ్ మోడీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

జనగామకు సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెట్టాలి

లిబర్టీ: సామ్రాజ్యవాదులను గడగడలాడించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పేరును ఒక జిల్లాకు పెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్రు కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆత్మగౌరవ పతాక భువనగిరి కోటగా సుభిక్షంగా పరిపాలన సాగించిన సర్దార్ పాపన్నగౌడ్ చరిత్రలో తన పేజీని నిలుపుకొన్నారని ఆయన గుర్తు చేశారు. దళ్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ జిల్లాకు సర్దార్ పాపన్నగౌడ్ జిల్లాగా పేరు నామకరణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు త్వరలో జరిగే రాష్ట్ర కేబినేట్‌లో సర్దార్ పాపన్నగౌడ్ పేరు పెడుతూ తీర్మానం చేయాలని ప్రభుత్వానికి సూచించారు.

మిర్గం.. చేపలు పిరం


మిర్గం (మృగశిరకార్తె) సందర్భంగా ప్రతి ఒక్కరూ చేపలు తినడం ఆనవాయితీ. ఈ ఏడాది మృగశిలకార్తె శనివారం రోజు రావడంతో చాలామంది ఆసక్తి చూపకపోవడంతో చేపల అమ్మకాలు అంతంత మాత్రమే జరిగాయి. దీంతో మరుసటి రోజు ఆదివారం చేపల దుకాణాలు కిటకిటలాడాయి. - సుభాష్‌నగర్